క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



సోమశిల : అనంతసాగరం మండల కేంద్రం లోని బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ సెక్రటరీ బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి సహకారంతో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరుని కల్యాణం నేడు



వరికుంటపాడు : వరికుంటపాడులోని పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం జరుగుతుందని ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

ఆత్మకూరు మహిళకు అవార్డు



ఆత్మకూరు : పట్టణంలోని తోటవీధికి చెందిన జయ గోర్స్కాకు విశిష్ట సేవా అవార్డు వరించింది. వైఎస్సార్‌సీపీ నేతగా జయ గోర్స్కా తన సొంత నిధులతో పేదలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో హైదరాబాద్‌కు చెందిన లెజెండ్ సోషల్ సర్వీస్, కల్చరల్ ఆర్గనైజేషన్ సంస్థ ఆమెను అవార్డుకు ఎంపిక చేశారు. దీంతో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా సత్కరించి అవార్డును అందజేశారు. ఈ క్రమంలో ఆమెను ఆత్మకూరు, నెల్లూరుకు చెందిన పలువురు సోమవారం అభినందించారు.

టీఏ బిల్లుల చెల్లింపు

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వింజమూరు, కొండాపురం, కలిగిరి, జలదంకి మండలాల్లో 'పోషణ్ బీ.. పదాయి బీ' శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలకు టీఏ బిల్లులను జమ చేసినట్లు సీడీపీఓ పద్మజాకుమారి సోమవారం తెలిపారు. అదేవిధంగా భోజనం, స్నాక్స్, టీ, వాటర్, శిక్షణ మెటీరియల్ తదితరాల కోసం రూ.1,080 చొప్పున ఇచ్చినట్లు వివరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ఆత్మకూరు : అనారోగ్యంతో వైద్యం చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులో తన నివాసంలో సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన 14 మందికి రూ.17,11,020 విలువైన చెక్కులను అందజేశారు. స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



ఆత్మకూరు : పట్టణానికి చెందిన నాలుగు బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపల్ పరిధిలో తొమ్మిదో వార్డుకు చెందిన యడ్ల హజరత్‌రెడ్డి, 13వ వార్డుకు చెందిన జొన్నలగడ్డ శేఖర్, 19వ వార్డుకు చెందిన చిలపం రామలక్ష్మమ్మ, 22వ వార్డుకు చెందిన ఈగా నాగమ్మలు ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాలను పరమేశ్వరరెడ్డి పరామర్శించి రూ.10 వేల చొప్పున అందించారు. కేవీ శేషారెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కళాశాలకు భూమి ఇవ్వొద్దని వినతి

ఉదయగిరి : మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో సర్వే నంబర్ 152-ఏలో వంద ఎకరాల మేత పోరంబోకు భూమిని ప్రభుత్వ వ్యవసాయ కళాశాలకు కేటాయించవద్దంటూ పలువురు గ్రామస్తులు తహసీల్దార్ సుభద్రకు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భూమిలో తాము మూగజీవాలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమ పొట్టకొట్టవద్దని కోరారు.

రంజాన్ తోఫా అటకెక్కినట్లేనా?

బియ్యం, చక్కెర మాత్రమే అందజేస్తున్న రేషన్ వాహనం (ఫైల్)



రంజాన్ సమయంలో ముస్లింలకు గతంలో ఇచ్చిన సరుకుల కంటే అధికంగా అందించి వారు సంబరంగా పండగలను చేసుకునేలా చేస్తాం.. ఇది కూటమి నేతలు ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు. అయితే సూపర్ సిక్స్ పథకాల వలే రంజాన్ తోఫాను సైతం కూటమి ప్రభుత్వం అటకెక్కించింది.

- కేవలం బియ్యం, చక్కెరతోనే సరి
- ముస్లింలకు కూటమి ప్రభుత్వం మోసం
- పండగలకు పప్పన్నమూ కరువే

దుత్తలూరు : కూటమి ప్రభుత్వం ముస్లింలకు రంజాన్ తోఫా ఇచ్చేలా కనబడటం లేదు. పండగ సమీపిస్తున్నా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారుల నుంచి ఎలాంటి స్పందన ఉండడం లేదు. ఈ పండగను ఆనందంగా జరుపుకోవాలని భావించిన పేద ముస్లిం కుటుంబాలకు కూటమి సర్కార్ నిలువునా మోసం చేసింది.

వెంటవెంటనే పండగలు

మరికొద్ది రోజుల్లో ఉగాది, రంజాన్ పర్వదినాలు వెంటవెంటనే వస్తున్నాయి. దీంతో రేషన్ లబ్ధిదారులు తమకు అన్నిరకాల వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. బియ్యం, చక్కెరతో పాటు కందిపప్పు, నూనె, ఇతర నిత్యావసరాలు ఇవ్వాలని కోరుతున్నారు. కేవలం సంక్రాంతి పండగ సమయంలో మాత్రమే కందిపప్పు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది.

ఇచ్చే ఉద్దేశం లేక..

నిజానికి రంజాన్ తోఫా ఇవ్వాలంటే అందులో రెండు కిలోల చక్కెర, ఐదు కిలోల గోధుమ పిండి, కేజీ సేమియా, 100 గ్రాముల నెయ్యి ఉండాలి. దీనికి సంబంధించి టెండర్లు పిలిచి ముందుగానే విడివిడిగా ప్యాకింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ అలాంటిదేమీ జరగలేదు. ఈ ప్రక్రియ జరగాలంటే కనీసం నెల నుంచి రెండు నెలల సమయం పడుతుంది. ఇచ్చే ఉద్దేశం లేకనే దీనిపై ఎటువంటి ప్రక్రియ చేపట్టలేదని పలువురు విమర్శిస్తున్నారు. అలాగే కందిపప్పు సరఫరా లేకపోవడంతో గ్రామాల్లో రేషన్ వాహనదారులు, రేషన్ డీలర్లు లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక విసుగెత్తిపోతున్నారు. కందిపప్పు మార్కెట్లో సుమారు కిలో రూ.150పైనే పలుకుతోంది. అదే చౌక దుకాణాల్లో అయితే కిలో రూ.67కే లభిస్తుండడంతో లబ్ధిదారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. మరో పక్క పండగ ఇంటిల్లిపాది పాయసం చేసుకోవాలన్నా కేజీపైన చక్కెర అవసరం ఉంటుంది. కానీ ప్రభుత్వం అరకేజీ ఇస్తుండడంతో బయట దుకాణాల్లో తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే కానుకలు అందజేస్తే తమకు పండగల వేళ భారం తగ్గేదని లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ నెలలో కనీసం కందిపప్పు కూడా ఇవ్వకపోవడంతో ఉగాది, రంజాన్ ఎలా జరుపుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో.. మొత్తం రేషన్‌కార్డులు	7,33,520
చౌక దుకాణాలు	1513
వాహనాలు	438

నిత్యావసర ధరలు పైపైకి..

రంజాన్, ఉగాది పర్వదినాలకు ప్రతిఒక్కరూ తమ కుటుంబాల్లో పిండి వంటలు చేసుకోవడం ఆనవాయితీ. అలాగే బంధుమిత్రులను ఆహ్వానించి వారికి పిండి వంటలతో పాటు విందులు ఇవ్వడం సహజం. ఈ క్రమంలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పండగలు ఎలా జరుపుకోవాలని పేదలు మదన పడుతున్నారు. నిత్యావసర సరుకులైన శనగ, కందిపప్పు, బెల్లం, నూనె ధరలు అమాంతం పెరిగి సామాన్యుడి జీవనంపై భారం మోపుతున్నాయి. నూనె ధరలు కంపెనీని బట్టి లీటర్ రూ.130 నుంచి రూ.170ల వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఈ ఏడాది రంజాన్, ఉగాది పర్వదినాలకు పిండి వంటలు చేసుకుని తినడం కష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊసేలేని కొత్తకార్డుల ప్రక్రియ

కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదు. ఉన్న కార్డుదారులకు సక్రమంగా సరుకులు అందివ్వలేకపోతోంది. కొత్త కార్డులు రాకపోవడంతో నూతనంగా పెళ్లయిన దంపతులు, సంతానానికి సంబంధించిన చేరికలు, వివిధ పథకాలకు వర్తించేందుకు అవసరమైన ధ్రువపత్రాలు కష్టమవుతోంది.

రంజాన్ తోఫా అందించాలి



ఏడాదికి ఒకసారి వచ్చే రంజాన్ పర్వదినానికి ప్రభుత్వం తోఫా అందించాలి. ప్రస్తుతం బయట మార్కెట్లో రేట్లు మండిపోతున్నాయి. అన్నిరకాల వస్తువులతో కూడిన తోఫాను అందించాలి.
– షేక్ భాను, నందిపాడు

కందిపప్పు ఇవ్వడం లేదు



ఈ నెలలో రంజాన్, ఉగాది పండగలు ఉన్నాయి. అయినా కూడా కందిపప్పు ఇవ్వలేదు. బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర, నూనె, గోధుమపిండి తదితర వస్తువులు అందించాలి.
– షేక్.మస్తాన్ బి

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో పేదలకు సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక, రంజాన్ తోఫా వస్తువులు ఇవ్వడంతో పాటు రేషన్ దుకాణాల్లో అన్ని సరుకులు ఇస్తామని హామీ ఇచ్చారు. వాటిని నెరవేర్చాలి.
– షేక్.ఖాదర్‌బాషా, ఏరుకొల్లు

కందిపప్పు అలాట్ చేయలేదు



రంజాన్ తోఫాకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదు. ప్రస్తుతం చౌక దుకాణాల ద్వారా కేవలం బియ్యం, చక్కెర మాత్రమే అందిస్తున్నాం. కందిపప్పు అలాట్ చేయలేదు. ఏదైనా ఉంటే ప్రజలకు సమాచారం అందిస్తాం. – నాగరాజు, తహసీల్దార్, దుత్తలూరు

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



సంగం : మండలంలోని దువ్వూరు, అనసూయనగర్, మక్తాపురం, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఉగాది పండగ విశిష్టత గురించి ప్రజలకు వివరించారు. కమిటీ సభ్యులు డి.సూరమాళి, రామయ్య, కోటేశ్వరరావు, కల్పన, మాళి, ప్రవీణ, పవిత్ర, కృష్ణ, ప్రదీప్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఓ బాధ్యతల స్వీకరణ



ఎస్టీఓ ఉస్మాన్

ఉదయగిరి : ఉదయగిరి సబ్ ట్రెజరీ అధికారిగా షేక్.ఉస్మాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెంకటగిరి ఉపఖజానా కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడ ఎస్టీఓగా నియమితులయ్యారు.

రేపు మండల సమావేశం

ఉదయగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం ఎంపీపీ మూలె పద్మజా అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ అప్పాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

దుత్తలూరులో శనగ కొనుగోలు కేంద్రం

సాక్షి ఎఫెక్ట్..

దుత్తలూరు : దుత్తలూరులోని కమ్మవారిపాళెం సొసైటీ కేంద్రంలో మార్క్‌ఫెడ్ అధికారులు శనగ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. జిల్లాలో శనగ కొనుగోలు కేంద్రాల్లేక, తక్కువ రేటుకు దళారులకు అమ్ముకుంటూ నష్టపోతున్న వైనంపై సాక్షిలో ఈనెల 22న 'శనగ రైతు బెంగ' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మార్క్‌ఫెడ్ అధికారులు సోమవారం శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ మేనేజర్ పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 16 మండలాల్లో శనగల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 2000 టన్నులు శనగలను సేకరించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చిందన్నారు. ఉదయగిరి ఏడీఏ పి.చెన్నారెడ్డి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, మార్క్‌ఫెడ్ ఎగ్జిక్యూటివ్ వేణు, సొసైటీ సీఈఓ సీహెచ్ లోకనాథ్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్

విరువూరులో..

వరికుంటపాడు : మండలంలోని విరువూరు గ్రామంలో శనగ, కంది కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఓ రవికుమార్, డీసీఎంఎస్ నిర్వాహకుడు సుధాకర్, సిబ్బంది వేణు, వీఏఏ శారద పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన తప్పనిసరి



ఆత్మకూరు : టీబీ గురించి వివరిస్తున్న డాక్టర్ బాలాజీ



చేజర్ల : చిత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ

ఆత్మకూరు : క్షయవ్యాధిని తొలి దశలోనే గుర్తించాలంటే తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఊపిరితిత్తుల వ్యాధి నిపుణుడు డాక్టర్ బాలాజీ అన్నారు. క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. యూపీహెచ్‌సీ సిబ్బందితో పాటు మండలాల్లో పనిచేస్తున్న ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. వైద్యులు బాలాజీ, మురళీలు క్షయవ్యాధి గురించి వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయవ్యాధికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తారని తెలిపారు. రెండు వారాలకు మించి జ్వరం, దగ్గినప్పుడు రక్తం పడుతుంటే తప్పనిసరిగా క్షయవ్యాధి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సోమశిల రోడ్డు వద్ద మానవహారంగా ప్రతిజ్ఞ చేశారు. ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మునికృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ ఉషాసుందరి, యునాని వైద్యుడు అబ్దుల్ రజాక్, పలు విభాగాల డాక్టర్లు కిరణ్, దత్తప్రసాద్, సాలేహా, మురళీకృష్ణ, తేజస్విని, గణేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారిలతో పాటు సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు సుధాకర్, వెంకటేశ్వర్లు, సుభహాన్ పాల్గొన్నారు.

- వింజమూరు(ఉదయగిరి) : స్థానిక మాసిలామణి వైద్యశాలలో క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత జిల్లా వైద్యాధికారి మాసిలామణి అవగహన కల్పించారు. అనంతరం పలువురు రోగాలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యుడు ప్రశాంత్, సిబ్బంది ఉన్నారు.
- ఆత్మకూరు(చేజర్ల) : తగిన జాగ్రత్తలు తీసుకుంటే క్షయవ్యాధిని నివారించవచ్చని చిత్తలూరు పీహెచ్‌సీ డాక్టర్ నవీన్ అన్నారు. టీబీ డేను పురస్కరించుకుని సిబ్బందితో కలిసి ఆయన సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శైలజాకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి ధర్నా



సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. తొలుత మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ మండలంలోని ప్రతి గిరిజన కాలనీలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందేలా చూడాలని కోరారు. తరువాత తహసీల్దార్ సుభాషిణికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నేతలు సుబ్బరాయుడు, వేము పెంచలయ్య, ఉప్పలపాడు మస్తాన్, గాడి సుధాకర్, సత్తార్, అంకయ్య, వెంగయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన



ఉదయగిరి : మండలంలోని పుల్లాయపల్లి, బోడబండ, కొత్తపల్లి గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో అడవుల సంరక్షణపై సోమవారం రాత్రి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అడవుల సంరక్షణ వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఉదయగిరి వెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వెంకటయ్య, ఎఫ్‌బీఓ చెన్నపరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సోమశిల : అనంతసాగరం మండల పరిధిలో నలుగురు జూదరులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గోగులపల్లి గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు పోలీస్‌స్టేషన్ సిబ్బంది సమష్టిగా దాడులు నిర్వహించారు. ఇందులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు బైక్‌లు, రూ.11 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు ఎస్సై జిలానీ ఉన్నారు.

పాసు పుస్తకాలివ్వండి

ఆత్మకూరు(చేజర్ల) : గ్రామాల్లో భూములను రీసర్వే చేసిన తర్వాత పలుచోట్ల ఇప్పటికీ పాసు పుస్తకాలు ఇవ్వలేదని, రైతులకు వెంటనే ఇవ్వాలని చేజర్ల తహసీల్దార్ మురళీకి ఆయన కార్యాలయంలో ఏటూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉగ్గుమూడి రఘురామిరెడ్డి సోమవారం వినతి పత్రం అందజేశారు. రీసర్వే అనంతరం భూముల విస్తీర్ణంలో హెచ్చు, తగ్గులుగా వచ్చాయని, దీంతో 1-బీ, అడంగల్‌ల ద్వారా బ్యాంకులలో రైతులకు రుణాలు ఇవ్వడంలేదన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా



వింజమూరులో ఇదీ పరిస్థితి

ఉదయగిరి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎప్పటిలానే అధికారులు డుమ్మా కొట్టా రు. కేవలం నాలుగు శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. అదేలా వింజమూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి కేవలం మూడు శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. మొత్తం 17 శాఖల అధికారులు రావాల్సి ఉన్నా గత కొన్ని వారాల నుంచి ఇదే తంతు సాగుతోంది. దీంతో సమస్యలపై వచ్చే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం షాపు తొలగించాలి



ఎక్సైజ్ సీఐకు విజ్ఞప్తి చేస్తున్న మినగల్లు మహిళలు

ఆత్మకూరు : తమ గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీనిని తొలగించాలని గిరిజన మహిళలు వేడుకున్నారు. ఈ మేరకు అనంతసాగరం మండలం మినగల్లు గ్రామ గిరిజన కాలనీ మహిళలు సోమవారం రాత్రి ఆత్మకూరు ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ వెంకట రమణమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో రేవూరు రోడ్డుపై ఉన్న మద్యం దుకాణాన్ని ప్రస్తుతం గిరిజనకాలనీ పక్కనే ఉన్న స్థలంలో ఏర్పాటు చేశారని, దీంతో రాత్రి వేళల్లో మద్యం సేవించిన పలువురు తమ ఇళ్ల వద్దకు వచ్చి కేకలు పెడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్నారు. వారి వెంట సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభపై ప్రజల అనాసక్తి

ఉదయగిరి(వింజమూరు) : వింజమూరు పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీ-4 గ్రామసభపై ప్రజలు అనాసక్తి చూపారు. కేవలం ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది మాత్రమే హాజయ్యారు. పంచాయతీ స్థాయిలో పేదల గుర్తింపు కోసం సర్వే చేసి అభ్యంతరాలపై గ్రామసభ నిర్వహించగా కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ సృజన, ఈఓ శివకుమార్ పాల్గొన్నారు.

వైద్యసిబ్బందికి అవార్డులు



వరికుంటపాడు : అవార్డు అందుకున్న కరీష్మా, సిబ్బంది



ఉదయగిరి : అవార్డులు అందుకున్న గండిపాళెం వైద్యారోగ్య సిబ్బంది

వరికుంటపాడు : క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలోని వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా అవార్డులను జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ సుజాత, జిల్లా క్షయ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ సోమవారం ప్రదానం చేశారు. మండలంలో క్షయ బాధితుల గుర్తింపుతో పాటు వారికి అందించిన మెరుగైన వైద్యసేవలు, నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు గుర్తింపుగా మండల వైద్యాధికారిణి కరీష్మా, తూర్పురొంపిదొడ్ల ఎంఎల్‌హెచ్‌పీ మరియరోజా, గణేశ్వరపురం ఏఎన్ఎం కె.కామాక్షి, రామదేవులపాడు ఆశా కార్యకర్త వి.భాగ్యమ్మలు అవార్డులను అందుకున్నారు.

- దుత్తలూరు : దుత్తలూరు పీహెచ్‌సీ సిబ్బందికి అవార్డులు దక్కాయి. ఇక్కడ సీహెచ్ఓగా పనిచేస్తున్న ఓంకారయ్య, ఏఎన్ఎం చంద్రావతిలు జిల్లా క్షయ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.
- ఉదయగిరి : మండలంలోని గండిపాళెం పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు శివకల్పన, సిబ్బంది కె.వెంకటసుబ్బయ్య, కె.శ్రీనివాసులు, సుప్రజలకు డీఎంహెచ్ఓ సుజాత, జిల్లా క్షయ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారికి పలువురు అభినందనలు తెలిపారు.
- సోమశిల : అనంతసాగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఉత్తమ సేవా పురస్కారాన్ని సోమవారం నెల్లూరులో అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.



దుత్తలూరు : అవార్డు అందుకుంటున్న ఏఎన్ఎం



సోమశిల : పురస్కారం అందుకుంటున్న డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

రేషన్ ఇప్పించండి మేడమ్



ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న పట్టణ వాసులు

- ఆర్డీఓకు పట్టణ వాసుల వినతి

ఆత్మకూరు : పట్టణంలో రెండు నెలలుగా రేషన్ బియ్యం సరఫరా సక్రమంగా లేదని, తమ ఇళ్ల వద్దకు రేషన్ పంపిణీ వాహనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేద మహిళలు ఆత్మకూరు ఆర్డీఓ పావనికి మొరపెట్టుకున్నారు. సీపీఎం పార్టీ నాయకుల సహకారంతో పట్టణంలోని 16, 17, 19, 20 వార్డులకు చెందిన పేదలు సోమవారం ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని ఆమెకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యం కోసం పడుతున్న ఇబ్బందులను ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆమె ఆయా డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు అయిన రత్నమ్మ, శ్రీనివాసులు, సురేష్ తదితరులతో మాట్లాడారు. మరోసారి ఇలాంటి ఆరోపణలు వస్తే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, యస్దాని, సందానీబాషా తదితరులు పాల్గొన్నారు. రేషన్ బియ్యం అందక వారు పడుతున్న బాధలను కొందరు ఇలా వివరించారు.

మునుపటిలా ఇప్పించండి



ఇంతకు ముందు మా ఇంటి వద్దకే బియ్యం, చక్కెర, ఇతర సరుకులు ఇచ్చేవారు. ప్రస్తుతం రేషన్ వ్యాన్ రావడం లేదు. డీలర్ దగ్గరకు వెళ్తే తమకు సంబంధం లేదని తరిమేస్తున్నారు. ఈనెలలో కూడా బియ్యం ఇవ్వలేదు. అధికారులు మా బాధను ఆలకించాలి.
– రంపతోటి చిన్నక్క, ఏసీఎస్సార్ కాలనీ

రెండు సార్లు ఫిర్యాదు చేశా..



రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని, ఇప్పటికే రెండుసార్లు ఫిర్యాదు చేశా. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆర్డీఓను కలిసేందుకు వచ్చాం. మమ్మల్ని మోసం చేయడం మంచిది కాదు.
– కట్టా వెంకటేశ్వర్లు, 20వ వార్డు

రోజూ తిప్పకున్నారు



బియ్యం కోసం రోజుల తరబడి తిప్పుకున్నారు. అయినా ఫలితం లేదు. దీనిపై గట్టిగా నిలదీస్తే గొడవ పెట్టుకుంటున్నారు. అధికారులు మా బాధను అర్థం చేసుకుని బియ్యం ఇప్పించాలి. – రాగి నారాయణమ్మ, 19వ వార్డు